నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

శాలిబండ: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. కిషన్‌బాగ్ ఓహెచ్, అర్ష్ మహల్, బిలాల్‌నగర్, అంజదుల్లాబాగ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. బహదూర్‌పురా ఓహెచ్, కిషన్‌బాగ్ ఏబీసీ, ఘాజిబండ, మిశ్రీగంజ్ (చందులాల్ బారాదరి) విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్ నుమా పరిధిలో..

చార్మినార్: టీజీఎస్పీడీసీఎల్ ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలోని షేక్ కి మసీద్, ఫలక్‌నుమా యుజిసి తదితర విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

'బోనాలను వైభవంగా నిర్వహిస్తాం'

చార్మినార్: సుల్తాన్ షాహి జగదాంబ ఆలయంలో ఈసారి ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయం కమిటీ చైర్మన్ రాకేష్ తివారి తెలిపారు. ఇందులో భాగంగా ఆలయ కమిటీకి కార్యవర్గాన్ని నియమించామన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సుదర్శన్, ఉపాధ్యక్షులుగా వరదరాజ్, శ్రీరాములు చారి, ప్రధాన కార్యదర్శిగా రాజేష్ తివారి, సంయుక్త కార్యదర్శిగా కృష్ణ ముదిరాజ్, కోశాధికారిగా వేణుగోపాల్, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా శశాంక్ తివారి, నరసింహా, రాఘవేంద్ర, విక్రమ్ సింగ్, గౌతం పాండే, రాంచందర్ పాండే, సాయికిరణ్ తదితరులు బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి కృషి చేయనున్నారన్నారు.

16న ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా

విజయనగర్‌కాలనీ: ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా ఈనెల 16న నిర్వహిస్తున్నట్లు మల్లేపల్లి ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో పలు అంతర్జాతీయ, జాతీయ సంస్థలతో పాటు ప్రైవేటు, ప్రభుత్వేతర, ప్రభుత్వ రంగ సంస్థలు పాల్గొని తమకు కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. అభ్యర్థులు ఎస్ఎస్సీ, ఐటీఐ, ఇంటర్మీడియేట్, ఇంటర్ ఒకేషనల్, డిప్లొమా, డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్ విద్యార్హత కలవారు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 16న ఉదయం 9.30 గంటలకు పోస్టు గ్రాడ్యుయేట్ కాలేజ్ ఆఫ్ లా, నిజాం కాలేజ్ గ్రౌండ్స్ 5వ గేట్, బషీర్‌బాగ్ హైదరాబాద్ నందు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 77994 72000, 99854 90144, 96662 74708లలో సంప్రదించవచ్చు.

సామూహిక ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సామూహిక ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

అపోలోకు ఏఎహెచ్ఏ సర్టిఫికెట్ ప్రదానం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చెస్ట్ పెయిన్‌తో వచ్చిన రోగులకు తక్షణ చికిత్స అందించినందుకు కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ సెంటర్‌గా అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏఎహెచ్ఏ) సర్టిఫికెట్‌ను అందజేసింది. రాష్ట్రాల్లోనే ఈ తరహా సర్టిఫికెట్ పొందిన మొదటి ఆస్పత్రిగా తాము నిలిచామని అపోలో ఆస్పత్రుల తెలంగాణ రీజియన్ సీఈఓ తేజశ్విరావు తెలిపారు. అపోలో హాస్పిటల్స్ హైదరాబాద్ ఎమర్జెన్సీ మెడిసిన్ హెడ్ డాక్టర్ ఇమ్రాన్ సుబ్హాన్ మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా గుండె సంబంధిత వ్యాధులే మరణాలకు ప్రధాన కారణమని, అలాంటి పరిస్థితుల్లో ఈ ఏహెచ్ఏ సర్టిఫికేషన్ ద్వారా అపోలో హాస్పిటల్స్ అందిస్తున్న క్లినికల్ ప్రోటోకాల్స్, టెక్నాలజీ వినియోగం, అంతర్జాతీయ ప్రమాణాలను స్పష్టంగా అమలుచేస్తున్నామని తెలిపారు. అపోలో హెల్త్ సిటీ సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మనోజ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ఈ సర్టిఫికేషన్ ద్వారా అపోలో ఆస్పత్రి గ్లోబల్ ఏహెచ్ఏ సర్టిఫైడ్ చెస్ట్ పెయిన్ సెంటర్స్ నెట్‌వర్క్‌లో చేరిందన్నారు. రోగి ఆస్పత్రికి వచ్చిన క్షణం నుంచి పీసీఐ ప్రక్రియ మొదలుపెట్టే వరకూ సమయం 60 నిమిషాల్లోపు పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్లు శిథిలం.. తాగునీరు కలుషితం

పాతబస్తీలో అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ

- మురుగునీరు కలిసిపోవడంతో కలుషితం అవుతున్న తాగునీరు
- నిజాం కాలం నాటి పైపులైన్‌లతో తలెత్తుతున్న సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



గౌలిపురాలో మురుగునీటి కాలువ నుంచే తాగునీటి పైపులైన్



ఇటీవల కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా జరగడంతో మరమ్మతులు చేసిన సిబ్బంది

చార్మినార్: నిజాం కాలం నాటి పైపులైన్‌లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. మురుగునీటి కాలువల నుంచి తాగునీటి పైపులైన్లు ఉండడంతో కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా జరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నారు. జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రంగు మారి దుర్వాసనతో...

గౌలిపురాలోని కొన్ని ప్రాంతాలతో పాటు ఫలక్‌నుమా నాగులబండ, అంబేడ్కర్‌నగర్, యశ్రబ్‌నగర్, గంగానగర్ తదితర బస్తీలలో తాగునీరు రంగు మారి దుర్వాసనతో సరఫరా అవుతుందని స్థానికులు అంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైపులైన్లు..తాగునీటి పైపులైన్లు కలిసి ఉన్నాయి. డ్రైనేజీ పొంగి మురుగునీరు, కుళాయి నీటి పైపుల ద్వారా కలిసిపోయి కలుషిత నీరు సరఫరా కొనసాగుతోంది. ఈ విషయాన్ని సంబంధిత జలమండలి అధికారులకు తెలిసినా తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాధ్యమైనంత వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లపై మురుగు..పరుగు..

పాతబస్తీలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగునీరు రోడ్లపై పారుతున్నా జలమండలి అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని పాతబస్తీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ పొంగుతున్న డ్రైనేజీలను శుభ్రం చేయడానికి వస్తున్న సిబ్బంది అక్కడే రోడ్లపై మురుగుతో కూడిన వ్యర్థ పదార్థాలను వేసి వెళ్లిపోతున్నారు. బస్తీల్లోని రోడ్లపై ఈ తొలగించిన డ్రైనేజీ మట్టిని రోజుల తరబడి అక్కడే ఉంచడంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త పైపులైన్ వేయాలి...



పొంగిపొర్లే మురుగునీటితో అనారోగ్యాలకు గురవుతున్నాం. ముఖ్యంగా పాదచారులు, స్కూల్ సమయాల్లో విద్యార్థులు రోడ్లపై పారుతున్న మురుగునీటితో పడరాని పాట్లు పడుతున్నారు. డ్రైనేజీ మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లకుండా గాడిలో పెట్టడానికి జలమండలి అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి క్రమం తప్పకుండా అమలు చేయాలి. తమ నాగులబండ బస్తీలో శాశ్వత పరిష్కారంగా కొత్త పైపులైన్ వేయాలి.
– బోయిని విజయ్‌కుమార్, నాగులబండ

ఉన్నతాధికారులు పర్యవేక్షించాలి..



జలమండలి ఉన్నతాధికారులు పాతబస్తీలోని కొన్ని బస్తీల్లో కుళాయిల ద్వారా వచ్చే డ్రైనేజీ మురుగునీటిని అరికట్టడంలో నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది సరైంది కాదు. ఫిర్యాదులు అందినప్పుడు మాత్రమే కంటితుడుపు చర్యల్లాగా తూతూమంత్రం పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఫిర్యాదులు అందినా, అందకపోయినా క్రమం తప్పకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తే ఆశించిన ఫలితాలుంటాయి. – సీఎం గౌడ్, గౌలిపురా

ప్రజా సమస్యలు పరిష్కరించండి



ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణతో సమావేశమైన బద్దం సతీష్ గౌడ్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరించాలని నియోజకవర్గం డెవలప్‌మెంట్ ఫోరం కన్వీనర్, గ్రేటర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దం సతీష్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని జీహెచ్ఎంసీ 14వ సర్కిల్ ఏఎంఓహెచ్ డాక్టర్ వెంకటరమణతో సమావేశమయ్యారు. అనంతరం సతీష్‌గౌడ్ మాట్లాడుతూ..జీహెచ్ఎంసీతో పాటు ఇతర శాఖల అధికారులు కూడా సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏఎంఓహెచ్ వెంకటరమణ తరహాలో అన్ని శాఖల అధికారులు స్పందిస్తే ప్రజలు సంతోషంగా జీవిస్తారన్నారు. జాంబాగ్ చార్‌కందిల్ వద్ద చెత్తాచెదారాన్ని తొలగించాలని ఫిర్యాదు చేసిన గంటల్లోపే డాక్టర్ వెంకటరమణ పనులు పూర్తి చేయడంతో స్థానికులంతా ఎంతో సంతోషంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ తరపున నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రతిరోజూ పర్యటించి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

'ప్రజలను పట్టించుకోని ఎమ్మెల్యే రాజాసింగ్'

అబిడ్స్: ప్రజా సమస్యలు పరిష్కారంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విఫలమయ్యారని నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎం.ఆనంద్ కుమార్ గౌడ్ అన్నారు. మూడుసార్లు ప్రజలకు మాయమాటలు చెప్పి ఎమ్మెల్యేగా గెలిచిన రాజాసింగ్ ప్రజలవైపు చూడడం లేదన్నారు. బేగంబజార్ అజిత్ ప్లాజా వద్ద గత వారం రోజులుగా రోడ్లపై డ్రైనేజీ పొంగిపొర్లుతుందని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. స్థానిక వ్యాపారులు డ్రైనేజీ సమస్యను తన దృష్టికి తేవడంతో వెంటనే వచ్చి వాటర్‌బోర్డు అధికారులచే సమస్య పరిష్కరించినట్లు వివరించారు. అజిత్‌ప్లాజా, బేగంబజార్ ఫీల్‌ఖానా ప్రాంతాల్లో వ్యాపారుల సమస్యలను ఆనంద్‌కుమార్ గౌడ్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఏ ప్రాంతానికి వెళ్లినా ఎమ్మెల్యే రాజాసింగ్‌పైనే ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గం నలుమూలలా పర్యటిస్తూ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే రాజాసింగ్ విఫలమైనప్పటికీ తాను అన్నిశాఖల అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు ఆనంద్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు.



బేగంబజార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

మహిళలకు మెరుగైన వైద్య సేవలు



కార్యక్రమంలో డాక్టర్ ఎవిట ఫెర్నండెజ్

అబిడ్స్: మహిళలకు, గర్భిణులకు ఉత్తమ వైద్య సేవలు అందించేందుకు అధునాతన అవుట్ పేషంట్ విభాగాన్ని ప్రారంభించినట్లు ఫెర్నండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎవిట ఫెర్నండెజ్ పేర్కొన్నారు. గర్భిణులు ప్రసవానంతరం కోల్కోవడానికి ఫెల్విక్ ఫ్లోర్, శస్త్ర చికిత్స అనంతరం పునరావాసం కోసం సమగ్ర ఫిజియోథెరఫీ సేవలందిస్తున్నామన్నారు. అన్ని అవుట్ పేషంట్ సౌకర్యాలు ఒకేచోట లభించే విధంగా అవుట్ పేషంట్ అధునాతన క్లినిక్‌ను శుక్రవారం ప్రారంభించినట్లు ఆమె వివరించారు. పీడియాట్రిక్, నియోనాటలజీ, పిడీయాట్రిక్ సేవలు కూడా అందిస్తున్నామన్నారు. చిన్నారులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు ఈ నూతన విభాగం సహాయపడుతుందన్నారు.

వైద్య విధాన పరిషత్‌లోని సమస్యలు పరిష్కరిస్తాం

సుల్తాన్‌బజార్: వైద్య విధాన పరిషత్ పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తామని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కమిషనర్ అజయ్‌కుమార్‌ను టీవీవీపీ పరిధిలో ఆసుపత్రుల సూపరింటెండెంట్లు డాక్టర్ రావూఫ్ నేతృత్వంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రావూఫ్ మాట్లాడుతూ..వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆసుపత్రుల సమస్యల పరిష్కారానికి కమిషనర్ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లామని తెలిపారు. ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సూర్యశ్రీ, డాక్టర్ సంతోష్, త్రిలోక్ వర్మ, అలేఖ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న వైద్యులు రావూఫ్

గంధపు చెట్ల దొంగల అరెస్టు

బంజారాహిల్స్: గంధపు చెట్లు దొంగతనం చేస్తున్న పార్ధీ గ్యాంగ్‌ను జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. యూసుఫ్‌గూడలోని నిమ్స్‌మే ప్రాంగణంలో ఇటీవల పెద్ద ఎత్తున గంధపు చెట్లు చోరీకి గురయ్యాయి. ఈమేరకు నిమ్స్ మే యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. రంగంలోకి దిగిన పోలీసులు మధ్యప్రదేశ్ పార్ధీ కమ్యూనిటీకి చెందిన పలస్‌బాయిపార్ధీ (22), షహరాజ్‌బాయి, నిమ్మత్‌బాయి, మాధురిఆదివాసీ తదితరులను పట్టుకున్నారు. 23 మంది కలిసి చోరీ చేసినట్లుగా గుర్తించగా 19 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరందరిపై గతంలో కూడా గంధపు చెట్ల దొంగతనంలో కేసు నమోదై ఉన్నట్లుగా పోలీసుల దర్యాప్తులో తేలింది. 20 రోజుల క్రితం నిమ్స్‌మే క్యాంపస్‌లోకి ప్రవేశించిన వీరంతా గుట్టుచప్పుడు కాకుండా వీటిని దొంగిలించి పరార్ కాగా పక్కా సమాచారంతో జూబ్లీహిల్స్ పోలీసులు వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

'ఉద్యోగుల సమస్యలపై పోరాడతాం'



దేవిదాస్



కాజిపేట్ హరి

సుల్తాన్‌బజార్: ఉద్యోగుల సమస్యలపై పోరాడతామని టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ నూతన అధ్యక్షుడు దేవిదాస్ అన్నారు. టీఎన్జీఓస్ డీఎంహెచ్ఎస్ యూనిట్ ఎన్నికలు శుక్రవారం ఎస్ ఆడిటోరియంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా నాగిరెడ్డి వ్యవహరించారు. మాజీ అధ్యక్షుడు మామిడి ప్రభాకర్, దేవి ప్రసాద్ ప్యానల్‌కు ఎన్నికలు నిర్వహించడంతో డీఎంహెచ్ఎస్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్, డీఎంఈ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎయిడ్స్ కంట్రోల్ బోర్డు, ఇతర శాఖలో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధ్యక్షుడిగా దేవిదాస్, ప్రధాన కార్యదర్శిగా కాజీపేట హరి, కోశాధికారిగా క్రాంతి కిరణ్, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్, దుర్గాభవాని, సాయి ఆశీష్ గెలుపొందారు. ఈ సందర్భంగా దేవిదాస్ మాట్లాడుతూ..తెలగాణ ఉద్యమ కాలంలో తాను అధ్యక్షుడిగా తెలంగాణ రాష్ట్ర సాధనకు పోరాడానని తెలిపారు. ఉద్యోగుల సమష్టి కృషితో తాను ఎన్నికల్లో గెలుపొందాలని పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిటీ కోర్టులు: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా శుక్రవారం 'సాక్షి'కి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకోసారి జాతీయ లోక్ అదాలత్‌ను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో అన్ని రకాల కేసులు పరిష్కరించడంలో దేశంలోనే హైదరాబాద్ జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని గుర్తు చేశారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ.. ఇరువురిపై కేసు నమోదు

నాంపల్లి: బాత్రూమ్ నీళ్ల విషయంలో ఇద్దరు అన్నదమ్ములు ఘర్షణపడ్డారు. ఈ ఘర్షణలో ఇరువురు కుటుంబ సభ్యులకు గాయాలు అయ్యాయి. ఈ ఘటన హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అఫ్జల్‌సాగర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బైకాడ్ రామచందర్, బైకాడ్ నర్సింగ్‌రావు ఇరువురు సహోదరులు. ఇద్దరూ ఒకే ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం బాత్రూమ్ నీళ్ల విషయంలో గొడవ తీవ్రరూపం దాల్చింది. ఈ దాడిలో ఒకరిపై ఒకరు రాడ్లతో, కట్టెలతో కొట్టుకున్నారు. దీంతో ఇరు కుటుంబసభ్యులకు గాయాలయ్యాయి. అన్నదమ్ములు ఇచ్చిన వేర్వేరు ఫిర్యాదులతో హబీబ్‌నగర్ పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిలోఫర్‌లో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ విజయ్‌కుమార్

నాంపల్లి: ప్రముఖ చిన్న పిల్లల ఆసుపత్రి నిలోఫర్‌లో తాగునీటి అవసరాలను తీర్చడానికి ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం సూపరింటెండెంట్ డాక్టర్ విజయ్‌కుమార్ ప్రారంభించారు. రూ.31 లక్షల 60 వేల విలువైన వాటర్ ప్లాంట్‌ను దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ విరాళంగా సమకూర్చింది. సేఫ్ డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ప్రారంభించడానికి ముందుకు వచ్చిన దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్‌కు ప్రొఫెసర్ విజయ్‌కుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. సీఎస్ఆర్ దివీస్ లాబోరేటరీస్ లిమిటెడ్ అధిపతి జి.నాగేష్, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ సీహెచ్.నాగజ్యోతి, ప్రొఫెసర్ ఆర్.వినోద్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ ఎస్.శ్రీకాంత్, ఆర్ఎంఓలు డాక్టర్ రమ్య, డాక్టర్ స్రవంతి, డాక్టర్ పల్లవి, డాక్టర్ కిరణ్, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్ ఎం.సముద్ర, షౌరి, హెచ్ఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సమక్షంలోనే ఘర్షణ



లోతట్టు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా/డబీర్‌పురా: భారీ వర్షానికి జలమయమైన లోతట్టు ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే సమక్షంలోనేఅతని అనుచరులు, స్థానికులు పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికుల వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి యాకుత్‌పురా యశ్రఫ్ నగర్, ధోబీఘాట్‌లోని లోతట్టు ప్రాంతాలకు స్థానిక నాలా నుంచి పెద్ద ఎత్తున్న వరద నీరు చేరుకుంది. దీంతో స్థానిక ఇళ్లలోకి నీరు చేరుకోవడంతో ఇంట్లోని వస్తువులతో పాటు ఓ ఇంట్లో పెళ్లికి తీసుకొచ్చిన సామగ్రి పూర్తిగా నీటిలో తడిసిపోయాయి. దీనిపై సమాచారం అందుకున్న ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి అక్కడికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ సహాయక చర్యలో ఉన్న స్థానికులు అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా నాలా నుంచి వరద నీరు వచ్చిందని ఎమ్మెల్యేకు వివరిస్తుండగా ఎమ్మెల్యే అనుచరులు, స్థానికులు ఘర్షణకు దిగారు. అప్రమత్తమైన ఎమ్మెల్యే భద్రత సిబ్బంది ఆయనను అక్కడి నుంచి పక్కకు తరలించారు. దీనిపై ఉమర్ కుటుంబ సభ్యులపై స్థానికుడు అజీజ్ రెయిన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్తులు

దూద్‌బౌలి: దూద్‌బౌలిలోని సిద్ధి బుద్ధి సమేత గణపతి స్వామి, సీతా రామాంజనేయ వార్ల దేవస్థానంలో 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఉదయం సత్యనారాయణ స్వామివ్రతం అభిషేకం గణపతి హోమం కుంకుమార్చన తులసి అర్చనతో పాటు వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త మహేశ్వరం శ్రీనివాస్ చారి మాట్లాడుతూ..ఈనెల 16వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవాలయ ధార్మిక సలహాదారులు చల్లా మల్లికార్జున శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు వీరేశర్మ, ఆలయ కమిటీ సభ్యులు వెంకటాచలం ముదిరాజ్ వల్లభోజు శ్రీనివాస్ చారి నాగరాజు పాల్గొన్నారు.

వయోవృద్ధులతో యువత సంబంధ బాంధవ్యాలు సమాజానికి మేలు చేస్తాయి



సర్వే రిపోర్ట్‌ను ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు

గన్‌ఫౌండ్రీ: వయోవృద్ధులతో యువత సంబంధ బాంధవ్యాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం రవీంద్ర భారతిలో హెల్ప్ ఏజ్ ఇండియ సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వేధింపుల నివారణ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని వయోవృద్ధులతో యువత సంబంధాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ సునంద, ప్రొఫెసర్ ఆర్‌కె. మూర్తి మాట్లాడుతూ..ప్రస్తుత సమాజంలో అనేక మంది వృద్ధులు ఒంటరితనం వల్ల నెగిటీవ్ భావాలతో జీవనాన్ని గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వృద్ధులపై జరుగుతున్న మానసిక, శారీరక దాడుల గురించి చర్చ జరగాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం వయోవృద్ధులతో యువత మంచి సంబంధాన్ని కలిగి ఉండడం వల్ల కలిగే ప్రయోజనాలను పలువురు వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో రచయిత సంరక్షణ చూడ వరప్పు, సామాజిక వేత్త దామోధర్, జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి సాయిశ్రీనివాస్, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి యతేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డి సేవలు చిరస్మరణీయం



మాట్లాడుతున్న జస్టిస్ సుభాష్‌రెడ్డి తదితరులు

సుల్తాన్‌బజార్: రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ ఆర్.సుభాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అబిడ్స్‌లోని రాజా బహదూర్ వెంకటరామిరెడ్డి బాయ్స్ హాస్టల్‌లో వ్యవస్థాపక దినోత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా జస్టిస్ సుభాష్‌రెడ్డి హాజరై వెంకటరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ..వెంకటరామిరెడ్డి విద్యార్థుల విద్య కోసం ఎంతో కృషి చేశారన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవాలని హాస్టల్‌ను నెలకొల్పి వారికి ఆహారంతో పాటు విద్యను అందించిన ఘనత వెంకటరామిరెడ్డిదే అన్నారు. ఆయన సమాజానికి చేసిన సేవలు ఎనలేనివన్నారు. ఈ కార్యక్రమంలో యోగి వేమన యూనివర్సిటీ మాజీ వైస్‌ఛాన్సలర్ ఏఆర్.రెడ్డి, ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షులు వెంకట రంగారెడ్డి, కార్యదర్శి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విమాన దుర్ఘటన మృతులకు ఘన నివాళి



శ్రద్ధాజలి ఘటిస్తున్న పాఠశాల విద్యార్థులు, నాయకులు

గౌలిపురా: అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాద ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని ప్రముఖ విద్యావేత్త, జ్ఞాన భారతి ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ వి.ప్రభాకర్ రావు అన్నారు. శుక్రవారం గౌలిపురా జ్ఞాన భారతి పాఠశాలలో తెలంగాణ సిటీజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటనలో మృతి చెందిన వారికి ఏర్పాటు చేసిన శ్రద్ధాంజలి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాధాకృష్ణ, పవన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాశమ్మోని శ్యాంరావు ముదిరాజ్, ప్రముఖ సంఘసేవకులు సామ విజయ్ కుమార్ పోతురాజు, తెలంగాణ విద్యుత్ శాఖ బీసీ విభాగం కార్యదర్శి జి.వేణుగోపాల్, పాఠశాల సిబ్బంది రమాదేవి, విజయలక్ష్మి, సీహెచ్.స్నేహలత, నిర్మల, ఇమ్రాన్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.